భారత్‌కు భంగపాటు

తొలి మ్యాచ్‌లో భారత్ ఘోర ఓటమి • కివీస్ సునాయస విజయం • బ్యాటింగ్ వైఫల్యంతో టీమ్‌ఇండియా కుదేలు • మహిళల టీ20 ప్రపంచకప్

మహిళల టీ20 ప్రపంచకప్ వేటను భారత్ ఓటమితో ప్రారంభించింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా బరిలోకి దిగిన టీమ్‌ఇండియాకు బ్యాటింగ్ వైఫల్యంతో న్యూజిలాండ్ చేతిలో పరాభవం తప్పలేదు. కివీస్ నిర్దేశించిన 161 పరుగుల మోస్తరు లక్ష్య ఛేదనలో భారత టాపార్డర్ దారుణంగా విఫలమవడంతో ఓటమి అనివార్యమైంది. స్మృతి మంధాన, షఫాలీ వర్మ, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ తీవ్రంగా నిరాశపరిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న కివీస్.. టోర్నీని ఘనంగా మొదలుపెట్టింది.

హర్మన్ (15)

దుబాయ్: భారీ ఆశలతో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీకి వెళ్లిన భారత క్రికెట్ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఘోర పరాభవం ఎదురైంది. మొదటి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేనకు న్యూజిలాండ్ షాకిచ్చింది. దుబాయ్ లోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో కివీస్ అమ్మాయిలు.. భారత్‌ను 58 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో ఘనంగా బోణీ కొట్టారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. కెప్టెన్ సోఫీ డివైన్ (36 బంతుల్లో 57 నాటౌట్, 7 ఫోర్లు) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా ఓపెనర్ ఫ్లిమ్మర్ (23 బంతుల్లో 34, 3 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడింది. భారత బౌలర్లలో రేణుకా సింగ్ (2/27) రాణించింది. లక్ష్య ఛేదనలో భారత్ 19 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. భారత్ తరపున ఒక్క బ్యాటర్ కూడా 20 పరుగుల మార్కును అందుకోలేకపోయారు. హర్మన్‌ప్రీత్ కౌర్ (15) టాప్ స్కోరర్. కివీస్ పేసర్ రొస్‌మెరీ మెయిర్ (4/19), లీ తహుహు (3/15), ఈడెన్ కార్సన్ (2/34) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. డివైన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

రాణించిన డివైన్, ఫ్లిమ్మర్..

మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ ఆది నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు సూజి బేట్స్ (27), ఫ్లిమ్మర్ తొలి వికెట్‌కు 7.4 ఓవర్లలోనే 67 పరుగులు జతచేశారు. వీరి దూకుడుతో 6.4 ఓవర్లలోనే ఆ జట్టు అర్ధ సెంచరీ భాగస్వామ్యాన్ని పూర్తిచేసింది. తెలుగమ్మాయి అరుంధతి రెడ్డి ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో నాలుగో బంతికి బేట్స్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీసింది. మరుసటి ఓవర్లోనే ఫ్లిమ్మర్.. ఆశా శోభన బౌలింగ్‌లో స్మృతి మంధానకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. డివైన్ సింగిల్స్‌కే పరిమితమైంది. అమెలియా కెర్ (13)ను రేణుకా వెనక్కి పంపింది. కానీ దీప్తి శర్మ 18వ ఓవర్లో బ్రూక్ హాలిడే (16) రెండు ఫోర్లు కొట్టగా డివైన్ కూడా ఓ బౌండరీ బాది స్కోరు వేగాన్ని పెంచింది. ఆఖరి ఓవర్లో మూడో బంతిని బౌండరీకి తరలించిన డివైన్.. హాఫ్ సెంచరీని పూర్తిచేసుకుంది.

భారత్ టపటప..

మోస్తరు లక్ష్య ఛేదనలో భారత్ రెండో ఓవర్ నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. స్టార్ బ్యాటర్ షఫాలీ వర్మ (2) రెండో ఓవర్ తొలి బంతికే ఈడెన్ కార్సన్‌కు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో భారత వికెట్ల పతనం మొదలైంది. ఇన్నింగ్స్ తొలి బంతినే బౌండరీకి తరలించిన స్మృతి మంధాన (12) కూడా కార్సన్ 5వ ఓవర్లో గ్రీన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరింది. మెయిర్ 6వ ఓవర్లో హర్మన్‌ప్రీత్ వికెట్ల ముందు దొరికిపోయింది. టీమ్‌ఇండియా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్న జెమీమా రోడ్రిగ్స్ (13), రిచా ఘోష్ (12) తీవ్రంగా నిరాశపరిచారు. సీనియర్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (13), బౌలింగ్ ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ (8) సైతం విఫలమయ్యారు. ఈ టోర్నీలో భారత్.. ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది.

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్: 20 ఓవర్లలో 160/4 (డివైన్ 57 నాటౌట్, ఫ్లిమ్మర్ 34, రేణుకా 2/27, ఆశా 1/22)

భారత్ : 19 ఓవర్లలో 102 ఆలౌట్ (హర్మన్‌ప్రీత్ 15, జెమీమా 13, మెయిర్ 4/19, తహుహు 3/15)

నేటి నుంచే టికెట్ల విక్రయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, బంగ్లాదేశ్ మధ్య ఈనెల 12న హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరగాల్సిన మూడో టీ20 మ్యాచ్‌కు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12:30 గంటల నుంచి పేటీఎం ఇన్‌సైడర్ వెబ్‌సైట్/ఆప్‌లో టికెట్లను విక్రయించనున్నట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఈనెల 8 నంచి 12 దాకా జింఖానా మైదానంలో రిడంప్షన్ చేసుకోవాలని సూచించారు. ఆఫ్‌లైన్‌లో టికెట్లను విక్రయించడం లేదని ఆయన స్పష్టం చేశారు.

రెండో రౌండ్‌కు బోపన్న ద్వయం

షాంఘై (చైనా): భారత టెన్నిస్ డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్న, తన సహచర ఆటగాడు ఇవాన్ డొడిగ్ (క్రొయేషియా) ఏటీపీ మాస్టర్స్ 1000 షాంఘై టోర్నీ రెండో రౌండ్‌కు ప్రవేశించారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-డొడిగ్ జోడీ.. 6-4, 6-3తో వరుస సెట్లలో పాబ్లో కరెనొ-పెడ్రొ మార్టిన్ (స్పెయిన్)ను వరుస సెట్లలో ఓడించింది.

సబలెంకకు షాక్

బీజింగ్ (చైనా): ఈ ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌తో పాటు ఇటీవలే ముగిసిన యూఎస్ ఓపెన్ గెలిచిన జోరుమీదున్న ప్రపంచ రెండో ర్యాంకర్ అరీనా సబలెంక (బెలారస్)కు చైనా ఓపెన్‌లో అనూహ్య షాక్ తగిలిం ది. ఈ టోర్నీ మహిళల క్వార్టర్స్‌లో సబలెంక.. 6-7 (5/7), 6-2, 4-6తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్) చేతిలో పరాభవం పాలైంది. దీంతో ఆమె 15 వరుస విజయాలకు బ్రేక్ పడ్డట్టైంది. సెమీస్‌లో ముచోవా.. చైనా అమ్మాయి కిన్వెన్ జంగ్‌తో తలపడనుంది. మరో సెమీస్ కోకో గాఫ్, పౌలా బడోసా మధ్య జరుగనుంది.

సఫారీల శుభారంభం

- **వెస్టిండీస్‌పై ఘనవిజయం**

లబ (4/29)

దుబాయ్: రెండేండ్ల క్రితం తమ సొంతగడ్డపై జరిగిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా.. 2024 ఎడిషన్‌ను విజయంతో ఆరంభించింది. శుక్రవారం దుబాయ్‌లోని దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా గ్రూప్-బీలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా పది వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచిత్తుగా ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన విండీస్.. సఫారీ బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు మాత్రమే చేయగలిగింది. స్టఫానీ టేలర్ (41 బంతుల్లో 44 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆదుకోవడంతో కరీబియన్ జట్టు ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో నొన్కులులెకొ లబ (4/29) నాలుగు వికెట్లతో విండీస్‌ను కట్టడి చేయగా పేసర్ మరిజన్నె కాప్ (2/14) రాణించింది. ఛేదనను సౌతాఫ్రికా ఓపెనర్లు కెప్టెన్ లారా వోల్వార్డ్ట (55 బంతుల్లో 59 నాటౌట్, 7 ఫోర్లు), తజ్మిన్ బ్రిట్స్ (52 బంతుల్లో 57 నాటౌట్, 6 ఫోర్లు) 17.5 ఓవర్లలో పూర్తిచేశారు. విండీస్ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. లబకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

భారత షూటర్లకు మరో స్వర్ణం

లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతక జోరును కొనసాగిస్తోంది. పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్ టీమ్ కాంపిటీషన్ ఫైనల్‌లో ముకేశ్ నెలవెల్లి, రాజ్‌వర్ధన్ పాటిల్, హర్సిమర్ సింగ్ కూడిన భారత త్రయం పసిడి సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇది 11వ స్వర్ణం. ఇదే ఈవెంట్ వ్యక్తిగత ఈవెంట్‌లో రాజ్‌వర్ధన్, ముకేశ్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మొత్తంగా ఈ టోర్నీలో భారత్ 11 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలతో 16 పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో కొనసాగుతోంది.

అజారుద్దీన్‌కు మరోసారి నోటీసులు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆయన హయాంలో హెచ్‌సీఏలో జరిగిన రూ. 20 కోట్ల అక్రమాలపై విచారణకు హాజరుకావాలని ఈడీ అజారుద్దీన్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. అజారుద్దీన్ గురువారమే విచారణకు హాజరుకావాల్సి ఉండగా వ్యక్తిగత కారణాల దృష్ట్యా తాను అందుబాటులో ఉండటం లేదని, వారం రోజులు గడువు కావాలని కోరుతూ ఆయన ఈడీ అధికారులకు లేఖ రాశారు. లేఖను పరిగణనలోకి తీసుకున్న ఈడీ.. మరో నోటీసు జారీ చేస్తూ ఈనెల 8న విచారణకు హాజరుకావాలని ఆయనకు సూచించింది.

ముంబైకి భారీ ఆధిక్యం

రసవత్తరంగా ఇరానీ కప్

లక్నో: ప్రతిష్టాత్మక ఇరానీ కప్‌లో రంజీ చాంపియన్ ముంబై భారీ ఆధిక్యంతో ఈ మ్యాచ్‌ను శాసించే స్థితికి చేరింది. లక్నోలోని ఏకనా స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 40 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. పృథ్వీ షా (76) మెరుపు అర్ధ సెంచరీ సాధించాడు. 37 బంతుల్లోనే అతడి అర్ధ సెంచరీ పూర్తవడం విశేషం. సర్ఫరాజ్ (9 నాటౌట్), తనుష్ (20 నాటౌట్) క్రీజులో ఉన్నారు. పృథ్వీ దూకుడుతో ఆ జట్టు 274 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 289/4 వద్ద నాలుగో రోజు ఆట ఆరంభించిన రెస్టాఫ్ ఇండియా (ఆర్‌వోఐ) 410 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు ఈశ్వరన్ (191) తృటిలో ద్విశతకాన్ని చేజార్చుకోగా ధ్రువ్ జురెల్ (93) సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు.

రాష్ట్రానికి గుర్తింపు తెచ్చేలా స్పోర్ట్స్ పాలసీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త స్పోర్ట్స్ పాలసీ ముసాయిదాపై శుక్రవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. అద్భుతమైన క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గుర్తింపు తెచ్చేలా కొత్త స్పోర్ట్స్ పాలసీని తయారుచేయాలని ఈ సందర్భంగా సీఎం అధికారులకు సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీని యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డా సంజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతితో సంఘం ప్రతినిధులు

'ఇందిరా మహిళాశక్తి'తో ఆర్థికాభివృద్ధి

- **జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**

జగిత్యాల, అక్టోబర్ 4: ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని 16వ వార్డులో పోరాండ్ల గ్రామ శ్రీ సాయి స్వశక్తి మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మి బోటిక్, లేడీస్ క్లాత్ హౌస్, 37వ వార్డులో వెల్దుర్తి గ్రామ అరుంధతి స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ కృతి ఎంబ్రాయిడరీ లేడీస్ టైలర్ షాప్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి ప్రారంభించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి తన వంతుగా పూర్తి మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, ఏపీఎం గంగాధర్, కౌన్సిలర్లు కూతురు రాజేశ్, కూసరి అనిల్, తోట మల్లికార్జున్, క్యాదాసు నవీన్, పిట్ట ధర్మరాజు, అల్లె గంగసాగర్, నక్కల రవీందర్‌రెడ్డి, గంగారెడ్డి నాగిరెడ్డి, బుర్ర ప్రవీణ్, ఆనంద్ రావు, ఎర్ర నర్సయ్య, శ్రీరామ్ భిక్షపతి, రామకృష్ణ రెడ్డి, అడెపు సత్యం, శేఖర్, గుంటి రవి, నక్క హరీశ్, తిరుపతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం: డీఎస్పీ

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 4: విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండల పరిషత్ ఆవరణలో జపాన్ కరాటే ఫొటో ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై బెల్ట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే కరాటే నేర్చుకుంటే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. అలాగే ఆకతాయిల నుంచి తమను తాము రక్షించుకోచ్చన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే కరాటే నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, కరాటే స్టేట్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పాషా, జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాశ్, టెన్నికల్ డైరెక్టర్ ప్రభాకర్, ఆల్ రౌండర్ పీడీ గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

జగిత్యాల టౌన్, అక్టోబర్ 4: డీఎస్సీ-2024లో తాత్కాలికంగా స్కూల్ అసిస్టెంట్స్, ఎస్‌జీటీ, పీఈటీ, లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు 1:3 రేషియోలో ఎంపిక చేస్తున్నట్లు డీఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులు చివరి అవకాశంగా శనివారం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల లోగా వారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, చెక్‌లిస్ట్, రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ప్రత్యేక జీపీగా గణేశ్‌పల్లిని ఏర్పాటు చేయాలి

- **సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ లేఖ**

సారంగాపూర్, అక్టోబర్ 4: మండలంలోని పోతారం పంచాయతీ పరిధిలోని గణేశ్‌పల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పోతారం పరిధిలోని గణేశ్‌పల్లిలో వందశాతం బలహీన వర్గాల ప్రజలు నివసిస్తున్నారని, ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. గణేశ్‌పల్లిలో వెయ్యి జనాభాతోపాటు 500 వరకు ఓటర్లున్నారు. గణేశ్‌పల్లిని పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలు ఉన్నాయని, భవనాలు నిర్మించేందుకు అవసరమైన భూమి కూడా ఉందని లేఖలో పేర్కొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి

- **కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**
- **కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం**

పద్మశాలీ కమ్యూనిటీహాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, అక్టోబర్ 4: పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివారు కోనరావుపేట రోడ్డులో సీఎస్ఆర్ నిధులు ₹50లక్షలతో పద్మశాలీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పద్మశాలీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కొన్ని పనులు జరగకపోవచ్చని.. సాధ్యమైనంతా వరకు ప్రజలకు మేలు చేసేందుకు శాయశక్తుల పని చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఇటీవల ఆరాచకాలు పెరిగిపోయాయని ప్రజలు ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు సృష్టించే వారిపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. గాయత్రీ బ్యాంకు ఖాతాదారుడైన సాజిద్‌అలీ ఇటీవల మృతి చెందగా, నిర్భయ సేవింగ్ ఖాతా ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష ప్రమాద బీమా చెక్కును క్యాంప్ ఆఫీస్‌లో అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గుంటుక ప్రసాద్, సంఘం నాయకులు బాలె నర్సయ్య, గుంటుక సాంబమూర్తి, జక్కుల ప్రసాద్, గుంటుక ప్రకాశ్, గడ్డం మధు, చాప కిశోర్, చెన్న విశ్వనాథం, బీఆర్ఎస్ నాయకులు ఫహీమ్, అన్వర్, సునీల్, అస్లాం, ఆనంద్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జగిత్యాల రూరల్, అక్టోబర్4: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన లక్ష్మీపతి పంతులుకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేశ్ అందజేశారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, నాయకులు సమిండ్ల శ్రీనివాస్, దామోదర్‌రావు, పడిగెల గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

పండుగలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి: విప్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, అక్టోబర్ 4: దసరా, బతుకమ్మ పండుగలకు గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాస్థాయి అధికారులు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని అన్ని వీధులు, కూడళ్లు, బతుకమ్మ ఘాట్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించాలన్నారు. గ్రామ కూడళ్ల వద్ద పూలకుండీలు ఏర్పాటు చేసి ప్రత్యేకతను చాటాలన్నారు. సర్టిఫికెట్ల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలను అధికారులు ఇబ్బంది చేయవద్దని, త్వరగా జారీ చేయాలన్నారు. ఇక్కడ డీపీవో రఘువరణ్, ఆర్డీవో శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి మదన్‌మోహన్, ఎంపీడీవోలు శంకర్, పద్మావతి, తహసీల్దార్లు వినోద్, వసంత, రవికిరణ్, ఏపీఎంలు నరహరి, అశోక్, ఏఈలు చంద్రశేఖర్, అనిల్, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 4: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2024-25 సంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు ఏఐ కోఆర్డినేటర్ అనుమల్ల శ్యామ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత పత్రాలను ఏఐ సెంటర్లలో సమర్పించాలన్నారు. పూర్తి వివరాల కోసం నంబర్‌ను (9849266786) సంప్రదించాలన్నారు.

శంకుస్థాపనకు మంత్రి విముఖత

- **సీసీ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టిన స్థానికులు**

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 4: మెట్‌పల్లి పట్టణంలో సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేయకపోవడంతో స్థానికులే కొబ్బరికాయలు కొట్టిన ఘటన చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని అయ్యప్ప ఆలయం నుంచి డంప్‌యార్డు వరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.11 కోట్ల అంచనాతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనుల ప్రారంభానికి మెట్‌పల్లి పురపాలక శాఖ ఆధ్వర్యంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా పనులను ప్రారంభించేందుకు పురపాలక శాఖ అన్ని ఏర్పాట్లను చేసింది. అయితే కోరుట్లలో జరిగిన మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహాహాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మెట్‌పల్లికి చేరుకున్నారు. కారు నుంచి బయటకు దిగిన మంత్రి నిజామాబాద్‌లో కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉందంటూ సీసీ రోడ్డు పనుల ప్రారంభానికి విముఖత వ్యక్తం చేశారు. కాగా, తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు సమర్పించిన వినతిపత్రాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరం సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయకుండానే నిజామాబాద్ వెళ్లారు. దీంతో స్థానికులే కొబ్బరికాయలు కొట్టి శిలాఫలకాన్ని ప్రారంభించడం విశేషం.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

సర్వే పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

సర్పరాజ్‌పల్లెలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

కోరుట్ల రూరల్, అక్టోబర్ 4: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సర్పరాజ్‌పల్లెలో చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను ఆయన పరిశీలించి, సిబ్బంది పలు సూచనలిచ్చారు. కుటుంబ సభ్యుల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. కుటుంబ నిర్ధారణ